క్లుప్తంగా

విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది



పిట్టలవానిపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఖాజీపాలెం శివారు మండేవారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది వార్షిక తనిఖీలు నిర్వహిస్తూ ఉంటామని అందులో భాగంగానే నిర్వహించడం జరిగిందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం రికార్డులు, హాజరు పట్టీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీఆర్‌పీలు బొలిగాని విజయ్, ముసలయ్య, ప్రవంతి, కమల ఉన్నారు.

నేడు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

వేమూరు: సామాజిక ఆరోగ్య కేంద్రం 30 పడకల నూతన భవనం ప్రారంభం గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హరిణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పాల్గొంటారని ఆమె తెలిపారు.

తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన కిరణ్



వేమూరు: తహసీల్దారుగా వి.కిరణ్ ఉద్యోగ బాధ్యతలు బుధవారం చేపట్టారు. తహసీల్దారుగా పని చేసిన దేవరకొండ నాగరాజు, తిరుపతి జిల్లా కోట మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండల తహసీల్దారుగా పని చేసిన వి.కిరణ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు.

ఓటరు మార్పు, చేర్పులపై అశ్రద్ధ వద్దు

అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి



నెహ్రూనగర్: ఓటరు మార్పు, చేర్పు, తొలగింపుల దరఖాస్తులను బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓ)లు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం పశ్చిమ నియోజకవర్గ బీఎల్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఓటరు తుది జాబితా అనంతరం నూతన ఓటు నమోదు, మార్పుల దరఖాస్తులు అందుతున్నాయని, వాటిని బీఎల్‌ఓలు నిశితంగా పరిశీలించాలని సూచించారు. తొలగింపు దరఖాస్తులు వస్తే జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం తప్పనిసరిని తెలిపారు. ఓటర్ల వివరాలు తుది జాబితాలో సక్రమంగా వచ్చే వరకు బీఎల్‌ఓలదే బాధ్యతని, అనధికారికంగా సెలవులు తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, కేంద్రంలో మౌలిక వసతులపై సూపర్‌వైజరీ అధికారి, ఏఈఆర్‌ఓలకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, డిప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు, సూపర్‌వైజరీ అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు



గుంటూరు ఈస్ట్: హత్య కేసులో ఇద్దరు నిందితులను నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ నరేష్‌లు బుధవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శ్రీనివాసరావుతోటలో మంగళవారం షేక్ మహబూబ్ సుభానీని అతని తల్లి జరీనాబేగం, ఆమె ప్రియుడు షేక్ చిన్నబాజీ కలిసి రోకలి బండతో కొట్టి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం షేక్ చిన్నబాజీ, జరీనాబేగంలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ హత్య జరిగిన 24 గంటల్లోపు నిందితులను అరెస్టు చేయడానికి కృషి చేసిన ఎస్‌హెచ్‌ఓతోపాటు, సిబ్బందిని అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కోన రఘుపతి



కర్లపాలెంలో పింఛనుదారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం కర్లపాలెంలో పింఛన్ల లబ్ధిదారులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేయగా తుమ్మలపల్లి గ్రామంలో ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్లపాలెంలో జరిగిన సభలో ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ సీఎం జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, సినీ రచయిత కోన వెంకట్, ఎంపీటీసీలు ఆసిఫ్ అలీ, నాగరాజు, పార్టీ నాయకులు మండపాటి పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, మరకా పెద వెంకటేశ్వర్లు, చీరాల సత్యనారాయణ రెడ్డి, ఆట్ల పెద్ద శ్రీనివాసరెడ్డి, తాజుద్దీన్, ఇసాక్, మనోహర్, ఇమ్రాన్, జానీ తదితరులున్నారు.

పింఛన్ దారులకు దుప్పట్లు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు, అలకాపురం గ్రామాలలో కోన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం సామాజిక పింఛన్ దారులకు బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి తనయుడు వైఎస్సార్‌సీపీ నాయకులు కోన నిఖిల్ దుప్పట్లు అందజేశారు. కోన చారిటబుల్ ట్రస్టు బాపట్ల నియోజకవర్గంలోని ప్రజానీకానికి సహాయం చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలాశ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన తోటల పెంపకంపై అవగాహన ఉండాలి

అసోసియేట్ డీన్ డా. వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాసరావు

బాపట్ల: ఉద్యానవన తోటల పెంపకంపై రైతులు శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నారుమడుల పెంపకం, అంటుకట్టుట, అంటు తొక్కుట వంటి విధానాల పట్ల రైతులు శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని, పండ్ల తోటలు, కాయగూరల పెంపకంలో ఇది గణనీయమైన పురోగతిని సాధిస్తుందన్నారు. బాపట్ల వ్యసాయ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యానవన తోటలు ఆధునిక రైతు లోకానికి ఆర్థిక వనరుల పెంపుకు దోహదపడతాయన్నారు. మిద్దె తోటలు, పెరటి తోటల పెంపకం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులకు గులాబీ, మందార మొక్కల కాండాల కత్తిరింపులను విద్యార్థులు ప్రత్యక్షంగా చూపించారు. వీడియోల రూపంలో ప్రదర్శించడమేకాక పెరటి తోటల పెంపకానికి కావలసిన ఆర్గానిక్ బెండ, గోంగూర, తోటకూర, కొత్తిమీర విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా.ఎం.రమాదేవి, డా.ఎన్.రత్నకుమారి, డా.ఎం.సురేంద్ర బాబు, డా.సి.హెచ్.దుర్గ హేమంత్ కుమార్, కంకటపాలెం, జమ్ములపాలెం, బాపట్ల, నందిరాజుతోట గ్రామాల రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన మాత్రలపై అవగాహన



నులిపురుగుల నిర్మూలన మాత్రలపై శిక్షణనిస్తున్న డాక్టర్ నాగార్జున, డాక్టర్ ప్రణవి

నిజాంపట్నం: అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో ఉచితంగా అందించే అల్బెండజోల్ మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చని డాక్టర్ నాగార్జున తెలిపారు. కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లకు నులిపురుగుల మందుల పంపిణీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున, డాక్టర్ ప్రణవి పాల్గొని మాట్లాడారు. ఈ నెల 9వ తేదీన 66 పాఠశాలల్లో, 42 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 4,174 మంది చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలను అందించడం జరుగుతుందన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు అందించాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ కలయిక



గురువు రత్నారెడ్డి దంపతులను సత్కరిస్తున్న విశ్రాంత గురువులు

గుంటూరు ఎడ్యుకేషన్: అర్ధ శతాబ్దం తరువాత స్వర్ణోత్సవ కలయిక నిర్వహించుకున్న పూర్వ విద్యార్థులు ఒకనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును ఆత్మీయంగా సత్కరించుకున్న సంఘటన గుంటూరు నగరంలో జరిగింది. యాభై ఏళ్ల కిందట నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా బుధవారం గుంటూరు నగరంలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో విందులు, వినోదాలతో కాలక్షేపం చేయకుండా జీవితపు చివరి అంచులకు చేరిన తమ గురువును వెతుక్కుంటూ వెళ్లి ఘనంగా సత్కరించారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో 1973–76 బ్యాచ్‌కి చెందిన విద్యార్థుల్లో అధిక శాతం మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులుగా స్థిరపడ్డారు. మరికొంతమంది అనేక ఉన్నత పదవుల్లో పని చేశారు. సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకున్న వారంతా తొలుత ఉభయ కుశలోపరి నిర్వహించారు. తర్వాత తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రస్తుతం విద్యానగర్‌లో శేషజీవితం గడుపుతున్న రాజనీతి శాస్త్ర విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వై.రత్నారెడ్డి దంపతులను కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కంజుల సత్యనారాయణరెడ్డి, వెంకట్రావు, కృపానందం, నరసింహారెడ్డి, నాగరాజు, శౌరమ్మ, చిన్నమ్మ, ఉషారాణి, కృపారావు, సుబ్బారావు, కోటేశ్వరరావు, అప్పారావు, జార్జీ, గాలీబు, హనుమంతరావు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం

- డిప్యూటీ సీఎం ఎస్‌డి అంజద్‌భాషా
- 1.97 కోట్లతో నిర్మించిన పెదకాకాని బాజీబాబా దర్గా రోడ్డు, ప్రహరీగోడకు ప్రారంభోత్సవం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం ఎస్‌డీ అంజద్‌బాషా, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: ముస్లిం మైనార్టీలకు చట్ట సభల్లో గౌరవ స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం ఎస్‌డీ అంజాద్‌బాషా అన్నారు. ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రమైన పెదకాకాని బాజీబాబా దర్గా చుట్టూ నిర్మించిన ప్రహరీగోడ, ప్రధాన రోడ్డు నుంచి దర్గాలోనికి రూ.1.97 కోట్లతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యతో కలిసి బుధవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం బహిరంగసభలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం ఎస్‌డీ అంజాద్ బాషా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్గా ఈవో ముక్తార్‌బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు జిలాని, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యజుర్వేద పారాయణ మౌఖిక పరీక్ష



పెదకాకాని: శివాలయంలో ఖాళీగా ఉన్న కృష్ణ యజుర్వేద పారాయణం ఉద్యోగానికి బుధవారం జరిగిన మౌఖిక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్ర దేవదాయ శాఖ కార్యాలయం నియమించిన కమిటీ సభ్యులైన వెంకట రామకృష్ణ శర్మ(రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, నెల్లూరు), కె.త్రినాథ కళ్యాణ చందు(శ్రీకాళహస్తి దేవస్థానం) ఆధ్వర్యంలో, రాష్ట్ర దేవదాయ శాఖ ఏడీసీ టి.చంద్రకుమార్, సత్యనారాయణమూర్తి, ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసరెడ్డిల పర్యవేక్షణలో అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ వేదపారాయణ ఉద్యోగానికి మొత్తం 55 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఇంటర్వ్యూకు 43 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షకు సంబంధించి ఉత్తీర్ణత చెందిన అభ్యర్థి పేరును రాష్ట్ర దేవదాయ 0శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించి తదుపరి వెల్లడించడం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర్‌రావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ పరిధిలోని నార్త్ కేబిన్ వైపు రైలు పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుడికి సంబంధించిన వారు ఎవరనేది తెలియలేదు. రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందినట్లు సీఐ చెప్పారు. మృతదేహం నుజ్జునుజ్జు కావడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుడు పసుపు పచ్చచొక్కా, బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. వివరాలకు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, 94400627546, ఎస్ఐ వెంకటాద్రి 7207076614 నంబర్లను సంప్రదించాలి.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్ట్‌పేటకు చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ (40) అప్పుల బాధ భరించలేక బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

సాయినగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పట్టాభిపురం పోలీసులు బుధవారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 57,440 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



గుంటూరు ఈస్ట్: మతిస్థిమితం లేని బాలుడు పాఠశాల నుంచి తప్పిపోగా పట్టాభిపురం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగడిగుంటకు చెందిన ఎం.ఫణి అనే 16 సంవత్సరాల మతిస్థిమితం లేని బాలుడు జేకేసీ కళాశాల రోడ్డులోని దాక్షిణ్య పాఠశాలకు వెళ్లి తప్పిపోయాడు. పట్టాభిపురం పీఎస్ కానిస్టేబుల్ భూపతి ఎస్వీఎన్ కాలనీ పదో లైనులో గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్‌హెచ్‌ఓ విజయచంద్ర బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా రాంబాబు

పెదనందిపాడు: పెదనందిపాడు వ్యవసాయ పరపతి సహకార సంఘం నూతన అధ్యక్షునిగా నాగులపాడు గ్రామానికి చెందిన పాటిబండ్ల రాంబాబు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం పెదనందిపాడు సొసైటీ కార్యాలయంలో సీఈవో కోండేపాటి భాస్కరరావు వద్ద నుంచి బాధ్యతలు స్వీకరించారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన దివ్వి నాగేశ్వరరావు పదవీకాలం జనవరి 30తో ముగిసింది. నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన రాంబాబుకు సొసైటీ సిబ్బంది, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలో బుధవారం కిట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గత వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో సేవా శిబిరాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నిర్వహించిన ర్యాలీలో 'ఓటు హక్కు– మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు, ఓటు వేద్దాం.. మంచి నేతను ఎన్నుకుందాం' అంటూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటు నమోదు చేసుకునే విధానం వంటి విషయాలను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న కోన నిఖిల్

పిట్టలవానిపాలెం: ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి తోడుంటుందని బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువ నాయకులు కోన నిఖిల్ అన్నారు. మండలంలోని చందోలు గ్రామానికి చెందిన కుంచల కృష్ణారెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ హుస్సేన్, కనికిచర్ల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు విజయరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మునీర్ తదితరులున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తనయుడు నిఖిల్ చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో నరసింహమూర్తి, ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డిలు నిఖిల్‌కు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

తాగునీటి పంపుల ఏర్పాటు అభినందనీయం



తుమ్మలపల్లి గ్రామంలో తాగునీటి పంపును ప్రారంభించిన కోన వెంకట్.

కర్లపాలెం: తీరప్రాంత గ్రామాలైన తుమ్మలపల్లి, పేరలిపాడు గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణకు చేతి పంపులు ఏర్పాటు చేయటం అభినందనీయమని ప్రముఖ సినీ రచయిత వైఎస్సార్‌సీపీ నాయకులు కోన వెంకట్ అన్నారు. మండల పరిషత్ నిధులతో ఎంపీపీ యారం వనజ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చేతి పంపులను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని పింఛనుదారులకు కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటితో పాటు తాగునీరు అందించేందుకు కూడా తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దబ్బకూటి ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, పార్టీ నాయకులు అక్కల శ్రీనివాసరెడ్డి, మండపాటి పరమానందకుమార్, మరకా పెద వెంకటేశ్వర్లు, పేరాల వెంకట సురేష్, యారం ఇసాక్, ఆట్ల పెద్ద శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, సుబ్బారావు తదితరులున్నారు.

హిందూ ధర్మ రక్షణ మనందరి బాధ్యత

బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి, నిర్వాహకులు

భట్టిప్రోలు: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం కోసం సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) కృషి చేస్తుందని బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల సమావేశం బుధవారం భట్టిప్రోలు వేణుగోపాల స్వామి దేవస్థాన ప్రాంగణంలోని సాయి కృష్ణ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన సత్సంగ కార్యక్రమాలు, 24న దేవాలయాల్లో ఏకాదశ నగర సంకీర్తనలు, మాఘపౌర్ణమి సందర్భంగా 24న దేవాలయాల్లో సామూహిక హారతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ధర్మనిధి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మప్రచారక్‌లు జంజనం హేమశంకరరావు, చింతల మురళీ కృష్ణ, ఉప్పాల శ్రీనివాసరరావు, జంపని శివ దుర్గాప్రసాద్, జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, ఫౌండేషన్ సభ్యులు క్రాప రవికుమార్, బూర్లె అరుణ కుమారి, బొర్రా లక్ష్మీరాణి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం దిశగా కృషి చేయాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సుబ్బరామిరెడ్డి

గుంటూరు రూరల్: రైతు సంక్షేమం కోసం తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను రైతులకు అందించే విధంగా రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ సుబ్బరామిరెడ్డి తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న సమావేశ మందిరంలో రాష్ట్రంలోని 23 మంది కృషీ విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు, 13 మంది ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు, 26 మంది వ్యవసాయ శాఖలోని డీఆర్‌పీ సభ్యులకు వివిధ విభాగాల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించేందుకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతు స్థాయిలో దిగుబడులు తగ్గకుండా ఉండటం కోసం నూనె గింజలు, అపరాలు, చిరుధాన్యాల పంటలలో దిగుబడిని పెంచేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని ఈ శిక్షణ తరగతుల్లో తెలుసుకోవచ్చన్నారు. పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్ ప్రశాంతి మాట్లాడుతూ విస్తరణ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో సమస్యలను చాలా నిశితంగా పరిశీలించాలని వాటిని నూతన పరిశోధన అంశాలతో తీసుకునే విధంగా తెలియజేయాలని సూచించారు. వేరుశనగలో దిగుబడి పెంచే విషయాలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ ప్రసన్నరాజేష్, పొద్దుతిరుగుడు, కుసుమ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నీలిమ, అపరాల దిగుబడి పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్ వి రమణ, చిరుధాన్యాలలో సాగును, దిగుబడిని పెంచే విధానాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవిలత, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీవీ చంద్రమోహన్‌రెడ్డిలు వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి రామారావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ జి కరుణాసాగర్, డీన్ డాక్టర్ రమణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ ఏ మణి, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బి విజయాభినందన, డాక్టర్ జి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఈ బైక్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: జీపీఎస్ టెక్నాలజీ ద్వారా మొబైల్ కంట్రోలింగ్ సిస్టం రూపకల్పనలో తమ విద్యార్థులు నూతన ఆవిష్కరణల ద్వారా జాతీయ స్థాయిలో కీర్తి పొందడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఐఎస్ఐఈ ఇండియా (ఇంపీరియల్ సొసైటీ ఫర్ ఇన్నోవేటివ్ ఇంజినీర్) ఆధ్వర్యంలో లుమినస్ ఎస్ఐఈపీ ఈ బైక్ ఛాలెంజ్ 2024 పేరుతో మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నందు ఐఈఎస్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు తయారు చేసిన ఈబైక్ ప్రదర్శనకు రెండు అవార్డులు లభించాయన్నారు. ప్రదర్శనలో లైట్ వెయిట్ అవార్డు, ఫ్యూచర్ అవార్డులను సొంతం చేసుకోవటం సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులు తయారు చేసిన ఈ బైక్ ఒకసారి ఛార్జ్ చేస్తే ఇద్దరు మనుషుల బరువును తీసుకుని 60 కిలోమీటర్ల వేగంతో సుమారు 80 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాస్ తెలిపారు. అవార్డులు పొందిన విద్యార్థులను కళాశాల ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ కె చంద్రశేఖర్, డాక్టర్ కృష్ణప్రసాద్, పీ వెంకటమహేష్, ఆర్ఎమ్ వరప్రసాద్‌లు అభినందించారు.